# పునర్జన్మ

చీకటి దుప్పటిలో మానవ ప్రకృతిని ఓలలాడించి... ఆనంద హేతువుగా స్వాగతించే వసంతరాత్రి కాదు... ఆ రాత్రి. అవును ఆ రాత్రి నిరంకుశపు రాత్రి, నిర్దాక్షిణ్యపు రాత్రి. కృష్ణారావుని నిలువెల్లా దహించివేస్తూ క్షోభపెడుతున్న కర్కశరాత్రి.

అతన్ని హింసిస్తున్నది నిద్రలేమికాదు. అనారోగ్యం కాదు, ఎందుచేతో అతని లోపలి కండరాలు కాలిపోతున్నాయి. ఎక్కడో ఏదో మెలిపెడుతున్నట్టు మెత్తని బాధ. కప్పుకున్న దుప్పటిని చికాకుతో విసిరికొట్టి... మంచంపై నుంచి లేచాడు. లైటు వేశాడు. గ్లాసుడు మంచినీళ్లు తాగాడు. తర్వాత ఏం చేయడం?

బల్లపై పుస్తకం వుంది. ఆ గదిలో అతనికి అప్పుడు పుస్తకమే. చదువుతూ తననితాను మరచిపోగలడు. అక్షరాలు అమ్మహస్తంలా జోకొట్టగలవు. ఆ రాత్రెందుకో పుస్తక మిత్రుడు కూడా సహకరించక చికాకు పెట్టాడు.

విశాలంగా పరుచుకున్న డబుల్ కాట్‌పై కేవలం అతనొక్కడు. మేడపైన ఒక మూలన విసిరేసినట్టుగా వుంటుంది అతని గది. అతడు ఒంటరి కాదు, గది తలుపులు తెరుచుకుని వచ్చాడు.

ఓహ్! కురుస్తోంది వెన్నెల...మల్లెపూల వానలా. వేలాడుతున్నాడు చంద్రుడు ముద్ద బంగారంలా. ఆ పక్కనే మెరుస్తున్నాయి తెలతెలమబ్బులు వెండి జలతారులా. వీస్తున్నాయి చలచల్లని గాలులు... ఆ సన్నజాజుల తీగల పైనుంచి మత్తుగా, గమ్మత్తుగా...

ఆ వాతావరణం కృష్ణారావుని ఆహ్లాదపరచలేదు. చికాకుపెట్టాయి. అక్కడే మాత్రం వుండలేక గబగబా మెట్లు దిగి కిందకి వచ్చేశాడు.

కింద టూ బెడ్‌రూమ్ పోర్షన్. లోపలంతా నిద్రపోతున్నారు. ఆ ఇల్లు

అతనిదే అయినప్పటికీ... ఆ సమయంలో తలుపు తట్టలేకపోయాడు. కాలింగ్‌బెల్ నొక్కలేక పోయాడు. నెమ్మది నెమ్మదిగా... అడుగులో అడుగు వేసుకుంటూ గోడపక్కనుంచి నడుచుకుంటూ వెళ్ళాడు. కిటికీ తగిలింది. ఆగాడు. కిటికీ రెక్కలు మూసివున్నాయి.

ఛ! తలకొట్టుకున్నాడు కృష్ణారావు. కిటికీ విరగ్గొట్టేయాలన్నంత కసి. ఆ కసితో కిటికీ రెక్కలు గట్టిగా లాగాడు. అతని ప్రతాపమో, లేక లోన గడియ పెట్టలేదో... కిటికీ రెక్కలు తెరుచుకున్నాయి స్వర్గద్వారాల్లా. తెరుచుకున్న కిటికీలోనుంచి చొరబడింది వెన్నెల దొంగలా.

టార్చ్‌లైటు వేసినట్టు... స్పష్టంగా లేకపోయినా బాగానే కన్పిస్తోంది కిటికీని ఆనుకొని వున్న మంచం.

మంచంపై విజయ పడుకుంది.

విజయ ఒక్కర్తే పడుకుంటే ఎంత బాగుణ్ణు!

విజయతోబాటు ఆమె పక్కలో ఇద్దరు పిల్లలున్నారు. మనస మసక వెన్నెల్లో విజయ శరీరం బంగారం, బంగారం. అందుకోవాలి, కొల్లగొట్టాలి. కిటికీలోంచి కృష్ణారావు చాచిన చేతికి ఆమె అందడం లేదు. చేతికి పిల్లలు తగులుతున్నారు. ఆమెను పిలిస్తే పలకడం లేదు, పిల్లలు కదులుతున్నారు. పిల్లలు కందిరీగలు. విజయ ఊరిస్తున్న తేనెపట్టు. తేనెను జుర్రుకునేది ఎట్లా?

అంతలో... గుర్ఖా విజిల్... అతని గుండెల్లో దడ.

దొంగలా ముడుచుకుపోయి... ఆ గన్నేరు చెట్టు చాటున నక్కేడు. విజిల్ చప్పుడు దూరమయింది. 'హమ్మయ్యా' అనుకుంటూ నెమ్మదిగా అటూ ఇటూ చూసుకుంటూ కిటికీ చేరాడు.

ఇప్పుడతని చేతిలో కాస్త పొడువుగా గన్నేరు రువ్వ వుంది. ఆ గన్నేరు రువ్వతో ఆమెను నెమ్మదిగా తట్టేడు. లేవలేదు. ఇంకాస్త గట్టిగా తట్టాడు. ఏ మాత్రం ప్రయోజనంలేదు. అతనిలో అసహనం రాజుకుంది. రువ్వతో ఆమె పిరుదులపై గట్టిగా ఒకటి వేశాడు.

తుళ్ళిపడి లేచింది విజయ. కెవ్వుమని కేకవేయలేదు గాని తెల్లబోయింది. నిద్రమత్తంతా వదిలిపోయింది. అయ్యో! ఏమిటిది...ఎవరైనా చూస్తే?

'విజ్జీ...విజ్జీ...పిసరంత దయ చూపించవా... నీ కనురెప్పల కాటుకంత కరుణ చూపించవా... ఇదిగో వేగిరం తలుపులు తెరు. వెన్నెల్లోకి రా, నా గదిలోకి రా... నా బాహువుల్లో కరిగిపో, స్వర్గతీరాలకు తీసుకుపో... ప్లీజ్ ప్లీజ్... విజ్జీ...

నా బంగారు విజ్జీవి కదూ...'

అతని ముఖంపై ఫడేల్మని కొట్టినట్లు కిటికీ రెక్కలు ధడేల్మని మూసుకున్నాయి. గెడలు బిగుసుకున్నాయి.

అతని ప్రార్థనకు అదీ ఆమె రెస్పాన్సు!

కృష్ణారావులో కోరిక కోపంగా మారింది.

ఇదేమైనా అక్రమ సంబంధమా! భార్యను... తన భార్యను పక్కలోకి రమ్మన్నాడు. అది నేరమా? అది పాపమా? తనకెందుకింత శిక్ష! సుఖంగా వుండాల్సిన సమయంలో ఈ చిత్రహింస ఏమిటి? భార్య అందుబాటులో వుండి కూడా ఈ ఎడబాటు ఏమిటి? సుఖంగా సాగాల్సిన రాత్రులు దగ్ధమవుతున్నాయి.

ఎన్నాళ్ళీ నరకం, ఏమిటీ హింస, ఇక లాభంలేదు. అటోఇటో రేపు తేల్చేయాలి. తన పరిస్థితి ఇప్పుడే ఇలాగుంటే... రేపు రిటైరయ్యేక ఎలా వుంటుంది? తన బతుకు ఏమవుతుంది? కుక్కకన్నా హీనమైపోతుంది అనుకున్నాడు. మరో పదిరోజుల్లో రిటైర్ కాబోతున్నాడు కృష్ణారావు.

ఉదయం టిఫిన్ చేస్తున్నప్పుడు... అక్కడ ఎవరూ లేకపోవడం చూసి "నువ్వొకసారి నా గదికి వస్తావా... నీతో మాట్లాడాలి" అన్నాడు కృష్ణారావు.

"పదండి వస్తాను" అన్నది విజయ గోడతో అన్నట్టు.

ఆమెకు కసిగా వుంది. కోపంగా వుంది, అతని విపరీత ప్రవర్తనకి విసిగి పోట్లాట పెట్టుకోవాలని వుంది.

అన్నట్టుగానే మేడపై గదిలోకి వచ్చింది విజయ.

ఆమె వస్తుంటే–

"గదిలోకి వసంతం నడుచుకు వచ్చినట్టుంది" అన్నాడు కృష్ణారావు తలుపులు దగ్గరకు వేస్తూ.

"బాగుంది...బాగుంది... నేను వసంతం... మీ గుండెల్నిండా పట్టేసిన కామభావన ప్రకోపం నన్ను వసంతాన్ని చేసింది. కామెర్ల కంటికి పాచిపట్టిన నిల్వనీరు... పన్నీరులా కన్పిస్తుంది. అనకూడదుగాని... మీకు ఏ పక్షవాతమో వచ్చి మంచంపై కదల్లేని స్థితిలో వుంటే... నా రాక వసంతంలా కాక మదర్‌థెరిస్సా హస్తంలా కనిపించేది.

అవునా... సరే ఇంతకీ ఎందుకు పిలిచారో చెప్పండి. ఎవరైనా వింటే సిగ్గు...సిగ్గు... నే వేగిరం వెళ్ళాలి"

"నేనెందుకు పిలిచిందీ నీకు తెలీదా! పిలిస్తే ఎందుకురావు? నా దగ్గరకు

రమ్మంటే పిల్లల దగ్గర పడుకుంటావు... నీ మొగుడు ఆ పిల్లలపాటి చేయడా"

ఏమిటీ మనిషి! తలకొట్టుకుంది విజయ.

ఇంతకాలం... పెళ్ళయిన లగాయితూ గుట్టుచప్పుడు కాకుండా, పరువు ప్రతిష్టలు దెబ్బతినకుండా నెమ్మదిగా సంసారాన్ని లాక్కొచ్చింది... ఇదిగో ఈ ఇంటిలోనే.

ఆణిముత్యాల్లాంటి పిల్లలిద్దర్ని కన్నది ఇక్కడే. ఒక ఆడపిల్ల, మగబిడ్డ. ఇద్దరినీ పెద్ద చదువులు చదివించి, పెంచే రీతిలో పెంచింది ఈ ఇంట్లోనే. కూతురికి పెళ్ళిచేసింది ఇక్కడే. ఇద్దరూ మనువళ్ళు పుడితే...పురుళ్ళు పోసింది ఇక్కడే. కూతురు బెంగళూరులో మొగుడూ పిల్లలతో దాని బతుకేదో అది బతుకుతుంది.

కొడుకు వున్నాడంటే... అటువంటి కొడుకు ఎంతో పుణ్యం చేసుకుంటేగాని లభించడు. బుద్ధిగా ఇంజనీరింగ్ చదివి ఈ ఊళ్ళోనే మంచి ఉద్యోగం చేస్తున్నాడు. తమతోబాటు ఇక్కడే వుంటున్నాడు.

ముఖ్యంగా కోడలు గురించి కూడా చెప్పుకోవాలి. ఆమె కోడలంటే కోడలుకాదు. కూతురులాంటిది.

ఎంత ఉత్తమురాలంటే వేరే కాపురం పెట్టడానికి ఒప్పుకోలేదు. అందరం కలిసే వుందామంది. చెన్నైలో మంచి జీతంతో మంచి ఉద్యోగం వస్తే 'వద్దు మనం వెళ్ళొద్దు' అంది భర్తతో. "వయసు పైబడుతున్న అత్తమామల్ని వదలి ఎక్కడికి పోతాం... వద్దు... వద్దు...వెళ్ళొద్దు" అంది.

ఈరోజుల్లో ఇటువంటి కోడళ్ళు వున్నారంటే ఎవరైనా నమ్ముతారా? ఈ ఇంట్లోనే ఇద్దరు మనవరాళ్ళు పుట్టారు. ఆ పిల్లల అందం, తెలివితేటలు, అల్లరి కబుర్లతో... హాయిగా కాలం గడిచిపోతుంటే...

ఇదెక్కడి గోల? తనపై కోపంతో మనవరాళ్ళపై పడి ఏడుస్తాడేం? అరవై ఏళ్ళు పెట్టుకుని... ఈ వయసులో తన పక్కలోని రమ్మని పీడిస్తాడేమిటి! సిగ్గు...సిగ్గు...ఎవరైనా చూస్తే నవ్విపోరా, పరువుపోదా... ఏం మనిషి!

"చూడూ. మనవరాళ్ళంటే నీకెంత ఇష్టమో... నాకూ అంతే ఇష్టం. అది కాదు నేను అనేది. నీవు మొగుడుని కాదని... మనవరాళ్ళను పక్కన వేసుకుని పడుకోవడం ఎంతమాత్రం సబబుకాదు, పద్ధతికాదు. భార్యగా నువ్వు నా పక్కన పడుకోవడం ధర్మం, అవసరం.

నేనంటున్నది అర్థంచేసుకో. నా ప్లేస్‌ని మనవరాళ్లు ఆక్రమించేరు అవునా. అది నువ్వూ నేను ఎప్పటినుంచో పడుకునే మంచం. ఆ మంచంపైనే పిల్లలిద్దరినీ

కన్నావు. మన మంచంపైకి వాళ్ళు ఎలా వచ్చారు. గుర్తుచేసుకో. కొడుకూ, కోడలికి పడకలో ఇబ్బంది కలగకుండా వాళ్ళ పిల్లల్ని నీవు పక్కలో వేసుకుని పడుకోవడం ఆరంభించావు నా ఇబ్బంది పట్టించుకోకుండా. నా పక్క హాల్‌లో సోఫాకమ్ బెడ్ అయింది.

నేను దగ్గరికి రాబోతుంటే అయ్యో పిల్లలు... పిల్లలంటూ నన్ను దూరంగా నెట్టేశావు. లాభంలేదని వెంటనే మనకి మేడమీద గది వేయించాను. మనిద్దరికోసం కట్టిన గది చివరికి 'నా గది'గా మారిపోయింది. నువ్వు హాయిగా మనవరాళ్ళను కౌగలించుకుని పడుకోగల్గుతున్నావు. నీవు లేకుండా నేను పడుకోలేకపోతున్నాను. నా పరిస్థితి దుర్భరంగా వుంటోంది... అర్థం చేసుకో"

"మీకేమైనా మతిపోయిందా... నన్నెందుకిలా వేధిస్తున్నారు. రాత్రులు కిటికీ దగ్గర దెయ్యంలా వచ్చి ఆ ఉన్మాద చేష్టలేమిటీ, ఇరుగూ పొరుగూ ముఖ్యంగా నీ కొడుకూ కోడలూ చూస్తే పరువేం కావాలి! తలెత్తుకు తిరగ్గలమా! దయచేసి నలుగురిలో నవ్వులపాలు కాకండి. ఏ వయసులో ముచ్చట ఆ వయసులో జరగాలి.

పడుకోవాల్సిన వయసులో మీతో పడుకున్నాగదా. నిన్న మనం. నేడు కొడుకూ, కోడలూ. వాళ్ళకు సహకరించడం మన ధర్మం. మనువరాళ్ళను అందుకే నా దగ్గర పడుకోబెట్టుకుంటున్నాను"

"నేనందుకు ఒప్పుకోను. మొదట్లోనే నేను మొండిగా వుండి నా ప్లేస్‌లో ఆ పిల్లల్ని పడుకోనీయకుండా జాగ్రత్త పడాల్సింది. నేను చేసిన తప్పు ఇప్పుడు నీకు ధర్మం అయిపోయింది. అయినా పిల్లలకి ప్రత్యేకంగా గది వుండాలి తెల్సా. పోనీ వాళ్ళను పడుకోబెట్టి తర్వాత నా దగ్గరకి వచ్చేయవచ్చుకదా?"

"క్షమించండి. మీరు చెప్పినట్లు నేను చేయలేను. ఎలా చేయగలను చెప్పండి? ఒక అలవాటుగా, దినచర్యగా కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న పద్ధతిని ఒక్కసారిగా మార్చి... మీ దగ్గరకు రావడం బాగోదు.

నేను చెప్తున్నాను వినండి. నాకీ వయసులో మీతో పడుకోవడం ఇష్టంలేదు. మనవరాళ్ళతోనే పడుకోవడం ఇష్టం. మీరిక ఆ విషయం ఎత్తితే నన్ను చంపుకు తిన్నట్లే. మీరు ఇలా చేస్తే నేను ఛస్తాను.

నా మాటవిని ఇకనైనా మీ పద్ధతులు మార్చుకోండి. ప్రవర్తనను సరిదిద్దు కోండి. మీ దృష్టి ఈ తుచ్ఛదేహం మీదకాకుండా... ఆ దేవుడిపై నిలపండి. ఆధ్యాత్మికతను అలవర్చుకొని ఒంట పట్టించుకోండి. అందుకు తగిన సాధన క్రమం తప్పకుండా చేయండి.

బలహీనతలను, ఇంద్రియాలను జయించండి. అదుపు తప్పిపోకుండా హుందాగా, గర్వంగా తలెత్తుకు బతకండి. గౌరవంగా తిరిగి అందరి మన్ననలు పొందండి. మీకు ఇంతవరకూ నలుగురిలో మంచిపేరుంది. ఈ చివరి స్టేజ్‌లో ఆ నలుగురిమధ్యే నవ్వులపాలు కాకండి. మరిక వస్తాను. ఎవరైనా చూస్తే నవ్వుతారు చాల్చాలు"

"ఆగు... నేను చెప్పేది కూడా విను. నేను మరో పది రోజుల్లో రిటైరవుతున్న విషయం నీకు తెల్సు. రిటైరయ్యేక నేను ఇక్కడ వుండను. పూణే వెళ్ళిపోతున్నాను. ఒక యం.ఎన్.సి. నుంచి మంచి ఆఫర్ వచ్చింది. ఆ ఉద్యోగానికి నేను ఒంటరిగా వెళ్ళిపోతున్నాను"

"వెళ్ళాలనుకుంటే వెళ్ళండి."

"నేను వెళ్తున్నట్టు భర్తగా చెప్పడం నా ధర్మం. ఇకపై నీకు ఏ ఇబ్బంది వుండదు. సంతోషంగా వుండు"

"అక్కడొక దానితో మీరు సంతోషంగా వుండండి"

"నా సంగతి నీకనవసరం... ఇక నీవు వెళ్ళొచ్చు" అని గది తలుపులు విసురుగా తెరిచేడు కృష్ణారావు.

విజయకి ఒక్కసారిగా దుఃఖమొచ్చింది. పమిట చెంగుతో కన్నీళ్లు తుడుచు కుంటూ మెట్లు దిగిపోయింది. విజయకన్నా ముందు ఆమె కోడలు గబగబా మెట్లు దిగిపోయింది. ఆమె అంతా విన్నట్టు వాళ్ళిద్దరికీ తెలీదు.

ఈ వ్యవహారం ఎవరైనా చూస్తే నవ్విపోతారు అన్నది విజయ. కాని కోడలు పిల్లకి నవ్వురాలేదు. ఆమె హృదయమెందుకో భారమయ్యింది. మనసు కలత బారింది.

తను మందారపూలు కోసుకుందామని మేడపైకి వచ్చింది. వాళ్ళ సంభాషణ చెవినపడ్డాక... మరిక అక్కడ నుంచి కదలలేకపోయింది. ఆమెకు తలతిరగడం ఆరంభించింది. ఒక చిన్న ఇంట్లో రెండు జంటలున్నప్పుడు... వాళ్ళకి ప్రయివేసీ లభించడంలో వున్న ఇబ్బందులు ఏమిటో కొంత అర్థమైనట్టు అనిపించింది.

ఇంటి కోడలుగా అది ముందుగానే తను గ్రహించకపోవడం బాధించింది. ఆ విషయమై ఆ రాత్రి భర్తతో చర్చించకుండా వుండలేకపోయింది.

***

"నాన్నా! మీతో ఒక విషయం... మీరు కాదనకూడదు... మా అందరికీ ఎంతో ఆనందం కలిగించే విషయం" తండ్రితో అన్నాడు కొడుకు.

"నేను కూడా చెప్పాలనుకుంటున్నాను. ఐతే అది నీకు ఆనందం కలిగించక పోవచ్చు" అన్నాడు కృష్ణారావు.

"ఫర్లేదు. చెప్పండి నాన్నా"

రిటైరయ్యేక పూణేలో తను చేయబోయే ఉద్యోగం గురించి చెప్పేడు.

"నేను మీ మాటకాదంటున్నానని కాదు... ఈ వయసులో మళ్ళీ ఉద్యోగం ఎందుకు?... మీకు పెన్షన్ వస్తుంది. నేను బాగా సంపాదిస్తున్నాననే విషయం మీకు తెలుసు. మనమంతా కలిసి వుండాలి. మిమ్మల్ని ఈ వయసులో వదిలి పెట్టగూడదని మా అందరి ఉద్దేశ్యం.మీకు ఏ లోటు లేకుండా చూసుకునే పూచీ నాది. మీ కోడలు ఎటువంటిదో మీకు తెల్సు. మీరు వెళితే తనూ బాధ పడుతుంది"

"మీ ఇద్దరి ప్రేమాభిమానాలు నాకు తెలియనివా! నేనూ, మీ అమ్మా ఎంతో అదృష్టవంతులం. మీరు అమ్మని బాగా చూసుకోండి చాలు. నాకు శక్తి వున్నంత కాలం ఉద్యోగం చేస్తాను. నేను అంతకన్నా వివరాలలోకి వెళ్ళలేను. కాదనకు. అర్థం చేసుకో... అది సరే నువ్వేదో విషయం చెప్పాలన్నావు"

"అవును నాన్నా! మరేం లేదు... మీకు షష్టిపూర్తి చేద్దామని. మాకిది మహదావకాశం. మాకిది పండుగ. అపూర్వమైన వేడుక. మా ఆనందానికి అడ్డు చెప్పకండి. అటు చెల్లెలు, బావగారు వస్తున్నారు. వాళ్ళేకాదు, మన బంధువులు, మిత్రులు అందరూ వస్తారు. నేను ఏనాడూ ఏదీ మిమ్మల్ని కోరలేదు. అడగలేదు. మీ షష్టిపూర్తికి మాత్రం అనుమతి ప్రసాదించండి చాలు. ప్లీజ్"

కళ్ళు చెమ్మగిల్లగా కాదనలేకపోయేడు కృష్ణారావు.

***

షష్టిపూర్తి వేడుక సందడి సందడిగా, వైభవంగా ఆనందోత్సాహాలతో ఆహ్లాదకర వాతావరణంలో సాగింది.

విశేషం ఏమిటంటే కృష్ణారావు పుట్టినరోజు పండుగలా కాక కృష్ణారావు, విజయమ్మల కళ్యాణోత్సవంలా ఘనంగా జరిగింది. కాదు, జరిపించింది కోడలు పిల్ల అనడం సబబు. కోడలూ, మరోవైపు కూతురూ పోటీపడి తనని పెళ్ళికూతుర్ని చేస్తుంటే ముసిముసి నవ్వులతో తలదించుకుని కాదనకుండా ముస్తాబైంది విజయమ్మ.

నిలువెల్లా సిగ్గుతో చితికిపోతూ తనని సింగారిస్తున్న పిల్లల చేతిలో పెళ్ళి బొమ్మే అయింది. షష్టిపూర్తి అంటే ఇదే గాబోలు అనుకొని... ఎవరేది చెబితే అది కిమ్మనకుండా మనస్ఫూర్తిగా సహకరించింది.

ఉదయం పీటలమీద కృష్ణారావు, విజయమ్మలు ఆశీనులయ్యేరు. కోడలు పిల్లకి బాగా తెలిసిన ఒక పంతులు గారు వచ్చి మంత్రాలు చదువుతూ మొత్తం పెళ్ళితంతులా జరిపేరు. మధ్య మధ్యలో ఛలోక్తులు, పిట్టకథలు.

భార్యాభర్తల అనుబంధం గురించి, కొన్ని విషయాలు చెప్పేడు పంతులు. అవి విజయ గుండెల్లో బలంగా నాటుకుపోయి అలజడి రేపేయి.

సీతమ్మకు రాజభోగం అనుభవించే అవకాశం వుండీ కూడా ఆమె కష్టాలు కోరి తెచ్చుకుని శ్రీరాముని వెంట అడవికి ఎందుకెళ్ళాలి? అడవిలో, అటు లంకలో సమస్త బాధలు పడుతూ రాముడికోసం అనుక్షణం ఎందుకు తను పరితపించాలి?

ఆ ప్రశ్నలు సీతమ్మను అడిగితే... రాముడి బాణంలా ఒకే మాట చెప్పింది ఆ తల్లి... ఏమని?

"ఆయన నా భర్త"

అంతే. రాముడు ఎందరెందరికో ఎంతెంతో కావచ్చు. లోకానికి దేవుడు కావచ్చు. ఆమెకు మాత్రం రాముడు భర్త, తన జీవితం సమస్తం భర్తకే అర్పితం.

"అమ్మా! విజయా... సీతమ్మ మాట విన్నారు కదా. మీ భర్త గురించి మీరైతే ఏమంటారమ్మా... మీరు భార్యగా మూడున్నర దశాబ్దాలుగా మీ శ్రీవారికి మీ అమూల్య సేవలు అందించేరు, కాదు... ఇంకా అందిస్తూనే వున్నారు కదా... చెప్పండమ్మా... మొహమాటం లేకుండా మీ భర్త గురించి ఏమంటారో..."

ఏమంటుంది? కాసేపు మౌనం వహించింది.

కృష్ణారావుని పెళ్ళాడి... సీతలా కాకపోయినా తనూ కొన్ని కష్టాలు పడింది, కొన్ని ఇబ్బందులూ ఎదుర్కొంది. అయితే ఆ బాధలూ, ఇబ్బందులూ భర్త కారణంగా కాదు, ఆర్థిక ఒడిదుడుకుల వల్ల. భర్తంటే తనకు ఇష్టం లేదా? ఆ ప్రశ్న మొదటిసారి గా వేసుకుంది.

భర్తంటే ఇష్టంలేదని ఎలా అనుకోగలదు? తనను పూవ్వుల్లో పెట్టి చూసుకున్నాడు. చెప్పాలంటే భర్త చెప్పిన మాట తను వినడంకాదు, తనమాటే భర్త విన్నాడు.

ఏమి చెబితే అది చేశాడు. అంచేతనే కదా తన సంసారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లింది. రత్నాల్లాంటి ఇద్దరు పిల్లలను ఇచ్చాడు.

అతనికెలాంటి దురలవాట్లు లేవు, వ్యసనాలు లేవు. ఒక్క శృంగార కాంక్ష తప్ప... అది తనతోనే... పరస్త్రీ వ్యామోహితుడు కాదు మళ్ళీ. శృంగారం వ్యసనం అంటే ఒప్పుకోడు. అది శారీరక సహజ లక్షణం అంటాడు.

భార్యే తన ప్రపంచం. అతని ప్రపంచంలో తనకూ ఆనందమే తప్ప పేచీలు లేవు. తనతో చిన్నచిన్న గొడవలు, గిల్లికజ్జాలు లేకపోలేదు. అవి సంసారంలో సరిగమలే గాని ఏనాడూ తనను గాయపర్చలేదు.

పదిరోజుల క్రితం భర్తతో పెట్టుకున్న గొడవ గుర్తుంది. అదేం గొడవ! రామయణంలో పిడకలవేట! అంతకన్నా ఎక్కువేం కాదు. ఐతే ఆ రోజు తను మాట్లాడిన పద్ధతి బాగోలేదనేది గ్రహించింది. భర్తని బాధపెట్టినందుకు బాధ పడింది.

తన మొత్తం కాపురం పేజీలు తిరగవేస్తే... నిజం చెప్పాలంటే సీతమ్మకి రాముడెంతటివాడో... తనకూ తన భర్త అంతటివాడే అనిపించింది.

"అమ్మా! ఏమిటాలోచిస్తున్నావు, జవాబు చెప్పావ్మూ"

"సీతమ్మ మాటే... నా మాట కూడా"... అంది.

భార్యవైపు ప్రేమగా, గర్వంగా చూసేడు కృష్ణారావు.

***

ఆ రాత్రి మేడమీద గదిలో ఒకటే హడావిడి.

ఆ గది ఇప్పుడు నిస్తేజంగా లేదు. కళకళలాడుతోంది. గోడలంతా గులాబీలు, మంచమంతా మల్లెపూలు, అక్కడ బల్లపై ఊరించే స్వీట్లు, ఇష్టమైన ఫలాలు. గదిలో మత్తుగొలిపే అత్తరువాసన, సన్నగా షెహనాయ్ సంగీతం. వీటన్నిటిని సింగారించుకున్న ఆ గది... విజయమ్మకు స్వాగతం... సుస్వాగతం అంటూ ఆహ్వానించింది.

తెల్లచీరతో, మల్లెపూలతో, పాలగ్లాసుతో, ఒక కొత్త అనుభూతితో... సిగ్గుతో... గదిలోకి ప్రవేశించింది విజయ.

అనగనగా... అలనాటి తమ శోభనం గుర్తుకొచ్చింది కృష్ణారావుకి. అంతే ఉత్తేజితుడయ్యేడు ఇప్పుడు కూడా.

అతనికా సమయంలో నింగిపై, నేలపై వుండే సమస్త అందాలు విజయలోనే కన్పించాయి. ఆ అందాలపై తను చేయివేస్తే కస్సుబుస్సుమనలేదు.

తిరస్కారభావం ప్రకటించలేదు. శయనేషు రంభగా అతనికి సహకరించింది.

ముసలితనం అతని ముంగిట్లోకి ఇంకా ప్రవేశించలేదని... ఆమెకు ఆ రాత్రి అనుభవం చెప్పింది. తృప్తిగా 'అమ్మ...ముసిలాడా' అని సరసమాడింది.

ఈ మధ్య ఏది మిస్ అయిందో, ఎంత కోల్పోయిందో ఆమెకు స్పష్టంగా అర్థమైంది. అందుబాటులో వున్న స్వర్గాన్ని ఆస్వాదించకుండా... అతనిపై

విరుచుకుపడిపోయి ఆగ్రహించడం ఎంత పొరపాటు.

"నన్ను క్షమించండి" అంది భర్తతో.

"తప్పు నీది నాది కాదు, పరిస్థితులది. ఇప్పుడవన్నీ సర్దుకున్నాయి గదా. గతం మర్చిపో, ప్రస్తుతాన్ని ఆనందించు" అన్నాడు కృష్ణారావు.

***

ఆ రాత్రి నుంచి ప్రతీ రాత్రి... అతను పిలిచే పని లేకుండానే... విజయ మేడ మీద గదికి వస్తోంది.

కోడలు అత్తని ఇక తన మనవరాళ్ళతో పడుకోవడానికి వీల్లేదంది. పిల్లలకి ప్రత్యేక గది. వాళ్ళను పడుకోబెట్టడం తల్లిగా తన బాధ్యత అంది. 'మీ పక్క మాత్రం మేడమీద అత్తగారూ' అని సమస్యపై తెరవేసింది కోడలు.

మేడమీద గదిలో కృష్ణారావుతో విజయ...

"ఏవండీ నేనొకటి కోరుకుంటున్నాను, కాదనరుగా"

"ఏమిటో చెప్పు... నీమాట ఎప్పుడైనా కాదన్నానా"

"కాదనరని నాకు తెల్సు. మీరు కొత్త ఉద్యోగం కోసం కొత్త ఊరు వెళ్ళొద్దండీ. ఇక్కడ మనల్ని ఎంతగానో ప్రేమాభిమానాలతో చూసుకునే కొడుకూ, కోడల్ని వదలీ, మనవరాళ్ళ ముద్దూ ముచ్చట్లు కాదనీ ఎలా వెళ్ళిపోతారు చెప్పండి. నాకు మాత్రం అందరూ కావాలి"

"నేను వెళ్ళక తప్పదంటే..."

"మీతోబాటే నేనూను... వనవాసానికైనా సిద్ధం"

కృష్ణారావుకి పునర్జన్మ ఎత్తినట్టుగా వుంది.

*(స్వాతి వీక్లీ - 23 జనవరి 2009)*